



అమిత్‌షాకు అభివాదం చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసిన స్పీకర్

వికారాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశ రాజధాని న్యూఢిల్లీ అసెంబ్లీ భవనంలో రెండు రోజులపాటు జరిగే ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. అలాగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ రాష్ట్రాల స్పీకర్లకు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా శనివారం రాత్రి తాజ్‌మాన్‌సింగ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విందులో స్పీకర్ తన బృందంతో కలిసి పాల్గొన్నారు. ఆదివారం ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను స్పీకర్ ప్రసాద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌ముదిరాజ్, అసెంబ్లీ వ్యవహారాల కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు పాల్గొన్నారు.



కోట్‌పల్లి ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగిని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతా..

» ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పరిగి ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగి శివారులోని కొత్తకుంట చెరువు, లక్నాపూర్ ప్రాజెక్టు, జాఫర్‌పల్లిలోని అర్బన్‌పార్కులను హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన లేక్ బ్యూటిఫికేషన్‌లో భాగంగా జాఫర్‌పల్లిలో 140 ఎకరాల్లో అర్బన్‌పార్కు, పరిగిలోని కొత్తకుంట చెరువు, లక్నాపూర్ ప్రాజెక్టులను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా మారుస్తామన్నారు. లక్నాపూర్‌లో బోటింగ్‌వసతి కల్పించి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. కొత్తకుంట చెరువును మినీ ట్యాంకు బండ్‌గా మారుస్తామని, అప్పా నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డు, ట్రిపుల్ ఆర్ పరిగి అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ డీఈఈ శివకుమార్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ ఎఫ్ఆర్‌వో సత్యనారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జాలర్లకు పడవలు సమకూరుస్తా..

» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



జాలర్లతో మాట్లాడుతున్న ఎంపీ


పరిగి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జాలర్లకు చేపలు పట్టేందుకు అవసరమైన పరికరాలను, పడవలను సమకూరుస్తామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన లక్నాపూర్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్నాపూర్ ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఎక్కువ అస్కారం ఉందని తెలిపారు. ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాలని, అందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరుతానన్నారు. పరిగిలో చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని జాలర్లు కోరగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య, పార్టీ మండల అధ్యక్షురాలు అనసూయ ఉన్నారు.

వంటతో పాటు పంట

అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయ, ఆకుకూరల సాగు

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. 'పోషణ వాటిక' పథకం ద్వారా అంగన్ వాడీ కేంద్రాల్లోని ఖాళీ స్థలాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించాలని నిర్ణయించింది. ఈ పథకానికి కేంద్రం నిధులు కేటాయించనుంది. ప్రస్తుతం రంగారెడ్డిజిల్లాలో 176 కేంద్రాలు, వికారాబాద్ జిల్లాలో 90కేంద్రాల్లో కూరగాయలు, ఆకుకూరల పెంపకానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు విత్తనాల పంపిణీ ప్రక్రియ పూర్తయింది. ఉద్యానశాఖ ద్వారా ఆయాలు, టీచర్లకు తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు.





- 'పోషణ వాటిక' పథకం ద్వారా నిధుల కేటాయింపు
- విత్తనాల పంపిణీ పూర్తి.. ఉద్యానశాఖ అధికారుల పర్యవేక్షణ
- ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10వేలు కేటాయింపు
- తొలివిడత రూ.5వేలు అందజేత

పథకానికి ఎంపికైన కేంద్రాలు	జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	ఎంపికైన కేంద్రాలు
	రంగారెడ్డి	1600	176
	వికారాబాద్	1129	90
	మేడ్చల్	793	00



గున్‌గల్ అంగన్‌వాడీ వద్ద కూరగాయల విత్తనాలు వేస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయ, ఆకుకూరలను పెంచేందుకు చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్న సంగతి తెలిసిందే. నగర పరిధిలో అక్షయ పాత్ర వంటి సంస్థలు రాయితీపై భోజన సదుపాయం కల్పిస్తున్నాయి. అయితే ఇది పరిమితంగానే ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎక్కువ కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా పోషకాహారం అందిస్తున్నారు. అయితే ఒక్కోసారి బహిరంగ మార్కెట్‌లో అవసరానికి సరిపడా కూరగాయలు, ఆకుకూరలు దొరకడం లేదు. అలాగే ధరలు పెరగడం, నాణ్యత కొరవడడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తున్నాయి. కూరగాయ ధరలు పెరిగిన సమయంలో ప్రభుత్వం కేటాయించే

మిగతా 7వ పేజీలో...



ఇవేం మరుగుదొడ్లు

పరిగి బస్టాండ్‌లో 6

దుర్గంధభరితంగా టాయ్‌లెట్లు

నీటి సరఫరా లేక ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

రేపు వాహనాల వేలం

వికారాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నార్కొటిక్ డ్రగ్స్, వంటి కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 26న మంగళవారం వికారాబాద్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని సీఐ రాఘవీణ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. వేలంలో ఫైచర్ వ్యాన్, టాటా ఏస్, టాటా ఇండికా వాహనాలు ఉన్నాయని తెలిపారు. వివరాలకు 8712658755లో సంప్రదించాలని సూచించారు.

మండల పంచాయతీ ఇన్‌చార్జి అధికారిగా వీరప్ప



తాండూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తాండూరు మండల పంచాయతీ ఇన్‌చార్జి అధికారిగా చెనిగేశ్‌పూర్ పంచాయతీ కార్యదర్శి ఎం.వీరప్పను నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వీరప్ప మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పంచాయతీ అధికారిగా అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని తెలిపారు. కార్యదర్శులు కూడా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూస్తానని పేర్కొన్నారు.



పదోన్నతుల పండుగ

ఎస్జీటీలకు ప్రమోషన్లు

- 115 స్కూల్ అసిస్టెంట్..
- 16 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు
- జిల్లాలో 131 పోస్టులు భర్తీ అయ్యే అవకాశం

వికారాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా పదోన్నతి కల్పించిన పాఠశాల విద్యాశాఖ సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీజీ)కు స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించేందుకు రంగం సిద్ధం చేసింది. ఖాళీల జాబితాతోపాటు ఒక్కో ఖాళీ పోస్టుకు 1:3 ప్రాతిపదికన సీనియారిటీ జాబితా శనివారం విడుదల చేయగా, ఆదివారం అభ్యంతరాలను స్వీకరించారు. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు స్వీకరించడంతోపాటు ఒకరే రెండు పోస్టులకు అర్హులైతే వారు ఒక పోస్టు ఎంచుకునేందుకు అవకాశం కల్పించారు. వచ్చిన అభ్యంతరాలు, ఆప్షన్లను పరిశీలించిన విద్యాశాఖ అధికారులు పదోన్నతులకు అర్హులైన ఎస్జీటీల 1:1 జాబితా ఆదివారం విడుదల చేశారు. ఈ జాబితాలోని ఉపాధ్యాయులు 25న ఆన్‌లైన్‌లో పాఠశాలలను ఎంపిక చేసుకోవాల్సి ఉండగా, వారికి ఈనెల 26న పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేయనున్నారు. జూలై 31వ తేదీ వరకు జిల్లాలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పోస్టులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు గెజిటెడ్ హెడ్ మాస్టర్లుగా పదోన్నతులు పొందిన స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలను కూడా కలిపి ఖాళీల జాబితా రూపొందించారు. స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టులు 165 ఖాళీగా ఉండగా, వాటిలో 131 పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు అదనంగా మరో 28 బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నాయి. స్థానిక సంస్థల ఉన్నత పాఠశాలల్లో 25, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో

మిగతా 8వ పేజీలో...

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలను దక్కించుకున్నారు. ఆదివారం బెంగుళూరులో నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ 2025 పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సియల్ 369 విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 14 విభాగంలో నిర్వహించిన పోటీల్లో వరుణ్ తేజ్ ప్రథమ స్థానం, గోవింద్‌గుప్తా రెండో స్థానంలో నిలిచారు. అండర్ 17 విభాగంలో నిర్వహించిన పోటీల్లో వీరభద్ర ప్రథమ స్థానంలో, ఆదిత్య రెండో స్థానంలో నలిచారు. జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే విధంగా తీర్చిదిద్దుతామని యూనివర్సియల్ 369 నిర్వాహకులు తెలిపారు.



విజేతలుగా నిలిచిన మేడ్చల్ విద్యార్థులతో నిర్వాహకులు



తాండూరులో ఐటీఐ ఏటీసీ

తాండూరు ఏటీసీలో అడ్మిషన్లు

172 మందికి అవకాశం

- ఈ నెల 28 వరకు దరఖాస్తుల స్వీకరణ
- శిక్షణ పరికరాలకు రూ.60 కోట్లు కేటాయింపు

తాండూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 65 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లు మంజూరు కాగా, మొదటి విడతలోనే తాండూరుకు ఒకటి కేటాయించడంలో స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవ చూపారు. ఇందులో నాణ్యమైన శిక్షణ అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రపంచంలో ఏ మూలనైనా ఉద్యోగం చేసే విధంగా ఇక్కడ నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. వివిధ కోర్సులకు సంబంధించి 172 మందికి అవకాశం కల్పించారు. ఇందుకోసం ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. తాండూరు ఏటీసీని ఐదెకరాల విస్తీర్ణంలో రూ.25 కోట్లు వ్యయంతో

మిగతా 8వ పేజీలో...

యువతకు ఉద్యోగ అవకాశాలు



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇటీవల జాబ్‌మేళా నిర్వహించాం. నిరుద్యోగులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభించాయి. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ద్వారా మరో గొప్ప అవకాశం లభించింది. సెప్టెంబర్ 1న కార్మిక మంత్రి వివేక్ చేతులమీదుగా కోర్సు క్లాస్‌లను ప్రారంభింపజేస్తాం.

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ప్రమాదం అంచున ప్రయాణం

బషీరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మండల కేంద్రం నుంచి యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ వరకు నాలుగు లేన్లుగా రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అయితే ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా కాంట్రాక్టర్ పలుచోట్ల, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. అగ్గనూర్ వద్ద మలుపు ఉన్న ప్రాంతంలో రోడ్డు విస్తరణ కోసం ఓవైపు లోతుగా తవ్వకాలు జరిపారు. అక్కడ కూడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రేడియం స్టిక్కర్లు సైతం ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళలో వెళ్లే వాహనాదారులు జంకుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వృథాగా కంపోస్టు షెడ్లు

» కేంద్రాలకు తరలని చెత్త..

తయారుకాని ఎరువు

కొడంగల్ రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): చెత్తను సేకరించి వర్మీ కంపోస్ట్ తయారు చేసి దానిని రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లు వృథాగా మారాయి. కొడంగల్ మండలంలో 25 పంచాయతీలు, మున్సిపాలిటీలో నిర్మించిన వర్మీ కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోంది. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



నాగారం శివారులో ఉన్న షెడ్డు



కామారెడ్డిగూడలో విషాదఛాయలు

వికారాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు. గర్భంతో ఉన్న భార్యను ముక్కలు చేసి హతమార్చిన ఘటనతో మండలంలోని కామారెడ్డిగూడ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి, అదే గ్రామానికి చెందిన స్వాతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య తరుచూ జరుగుతున్న గొడవలు, రెండు కుటుంబాల మధ్య ఉన్న వైరంతో శనివారం దారుణంగా హతమార్చాడు. మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌లో జరిగిన ఘటనతో సొంతగ్రామం కామారెడ్డిగూడలో ఆదివారం విషాదఛాయలు అలుముకున్నాయి. స్వాతి తల్లిదండ్రుల ఇంటిముందు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎం.రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్గొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివ దేహానికి హైదరాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, సీపీఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సామాజిక రంగంలోకి అడుగేసిన సురవరం కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి, అంచెలంచెలుగా ఎదిగి సీపీఐ జాతీయ కార్యదర్శిగా సేవలందించారన్నారు. బతికున్నంత వరకు సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు.

పంచాయతీ ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు


వెంకిర్యాలలో పంచాయతీ ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరినారు

కొందుర్గు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ట్రాక్టర్‌ను వ్యవసాయ పనులకు వాడుతున్నారు. కొందుర్గు మండలం వెంకిర్యాలలో ఆదివారం పంచాయతీ ట్రాక్టర్‌ను కొందరు వ్యవసాయ పనులకు వాడుకున్నారు. పంచాయతీ ట్రాక్టర్‌లో వరినారు తీసుకువెళ్లారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య స్పందిస్తూ.. చెత్త సేకరణకు వాడేందుకే ట్రాక్టర్‌కు డీజిల్ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సొంత పనులకు ట్రాక్టర్‌ను వాడితే చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఇవేం మరుగుదొడ్లు..

పరిగి బస్టాండ్‌లో దుర్గంధభరితంగా టాయ్‌లెట్లు

- నీటి సరఫరా లేని వాష్ రూంలు
- ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని డిపో అధికారులు



అస్తవ్యస్తంగా మరుగుదొడ్లు

పరిగి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పరిగి బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలలు ప్రయాణికులు ఉపయోగించుకోలేని విధంగా మారాయి. వాటివైపు వెళ్తే వచ్చే దుర్గంధాన్ని ప్రయాణికులు భరించలేకున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని వాడుకుంటున్నా ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్టాండ్‌లో డిపో అధికారులు ప్రయాణికులకు కనీస వసతులు కల్పించడంలేదు. మరుగుదొడ్లు, టాయ్‌లెట్లు సరిగా లేక ముఖ్యంగా మహిళలు అవస్థ పడుతున్నారు. సమస్యలపై కొందరు ప్రయాణికులు అడిగితే అధికారులు వింత సమాధానం ఇస్తున్నారు. బోరు చెడిపోయి నీరు రావడం లేదని, పారిశుధ్య సిబ్బంది లేరని చెబుతున్నారు. మరి అలాంటప్పుడు పే అండ్ యూస్ విధానం ఎలా అమలు చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రయాణికులు డబ్బుచెల్లించి వాడుకునే మరుగుదొడ్లలో కనీసం నీటి సదుపాయం ఉండాలి. అలాగే కమోడ్/టాయ్‌లెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. నల్లాల్లో నీరు రావడం లేదు. ఇవేమీ నిర్వాహకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణపై దృష్టిపెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దేవుని ఎర్రవల్లిలో శ్రావణ మాస ముగింపు పూజలు


దేవుని ఎర్రవల్లిలో పల్లకి సేవ నిర్వహిస్తున్న గ్రామస్తులు


తంగడ్‌పల్లిలో ...

చేవెళ్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాస ముగింపు సందర్భంగా ఆదివారం మండల పరిధి దేవునిఎర్రవల్లి హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. హనుమాన్ చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని తంగడ్‌పల్లిలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయిభజన, పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

30న ఆలయ భూముల వేలం

కొందుర్గు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కొందుర్గులోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ భూములకు వేలం నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ కృష్ణయ్య ఆదివారం తెలిపారు. ఈ నెల 30న వేలం నిర్వహిస్తామని, రూ.10వేల డిపాజిట్ కట్టి వేలంలో పాల్గొనొచ్చని తెలిపారు.

కాలుష్య కోరల నుంచి గ్రామాన్ని కాపాడండి


కంపెనీ వ్యర్థ జలాలను చూపుతున్న మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

మూడుచింతలపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కంపెనీల నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాల నుంచి తమ గ్రామాన్ని కాపాడాలని మూడుచింతలపల్లి మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జీనోమ్ వ్యాలీ పరిధి తుర్కపల్లి, కొల్తూర్ గ్రామాల్లోని పరిశ్రమల నుంచి వ్యర్థాల కాలుష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. కంపెనీల వ్యర్థాలను పటేల్ కుంటలో డంప్ చేస్తున్నారని ఆరోపించారు. ఆ నీరు పెద్దచెరువులో కలుస్తోందన్నారు. రసాయన వ్యర్థాలతో ఈ ప్రాంతంలో దుర్వాసన వస్తోందని చెప్పారు. రసాయన వ్యర్థాలను రోడ్డుపై వదుల్తున్నారని తెలిపారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొల్తూర్ గ్రామ ప్రజలను కాపాడాలని ఆయన కోరారు.



• పగలే వెలుగుతున్న వీధి లైట్లు

ముట్పూర్, ఉత్తరాస్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు లైట్లు పట్ట పగలు సైతం వెలుగుతున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆన్ ఆఫ్ స్విచ్‌లు లేక లైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. - కొందుర్గు, ఆంధ్రజ్యోతి


చీర్యాల్‌లో వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న నాయకులు

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కీసర, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కందాడి శ్రవణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం చీర్యాల్‌లో లైఫ్‌లైన్ తులసి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యుల సలహాలు,సూచనల మేరకే మందులు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అఖిల్‌రెడ్డి, మప్పు రామారావు, శ్రీకాంత్, కృష్ణయాదవ్, సురేష్, అజయ్, శివరాం, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

నీలిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ...

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ లక్ష్మీనర్సింహ కాలనీలో నీలిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ప్రారంభించారు. నీలిమ ఆస్పత్రి వైద్యులు కాలనీల్లో వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో 510 మందికి చికిత్సలు చేసి మందులందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రాజేశ్వర్‌రెడ్డి, నందు, సంతోష్, రాఘవేందర్‌రెడ్డి, కార్తీక్, లోకేష్‌రెడ్డి, రవీందర్, వినోద్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రవీణ్, వైద్యులు పాల్గొన్నారు.


కాలనీ వాసులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వంటతో పాటు 'పంట'

(ఐదో పేజీ తరువాయి)

నిధులు సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయ, ఆకుకూరలు పండించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సొంతభవనాలు, ఖాళీస్థలాలు ఉన్న అంగన్‌వాడీలను గుర్తించి తొలివిడత ఇక్కడ కూరగాయ, ఆకుకూరల పెంపకాన్ని చేపడుతున్నారు. ప్రస్తుతం రంగారెడ్డిజిల్లాలో 176 కేంద్రాలు, వికారాబాద్ జిల్లాలో 90కేంద్రాల్లో ఈ కూరగాయ, ఆకుకూరల పెంపకానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని పోషణ వాటికలుగా నామకరణం చేశారు. కేంద్ర ప్రభుత్వ 'పోషణ వాటిక' పథకం కింద ఇందుకు అవసరమైన నిధులు కేటాయిస్తున్నారు. ఎంపిక చేసిన ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం రూ.10వేలు కేటాయిస్తోంది. అయితే తొలివిడత ఇప్పుడు రూ.5వేలు కేటాయించింది. ఈ మొత్తం డబ్బుతో ఖాళీ స్థలాలను చదును చేసి కూరగాయ, ఆకుకూరల పెంపకం కోసం స్థలాన్ని చదును చేసి సిద్ధం చేస్తారు. అలాగే విత్తనాలు, సారవంతమైన మట్టి, ఎరువు కోసం ఈ డబ్బును ఖర్చు చేయనున్నారు. వీటిని ఉద్యానశాఖ అధికారులు పర్యవేక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆయాలు, టీచర్లకు తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈమేరకు సిబ్బందికి ఉద్యానశాఖ సిబ్బందితో శిక్షణ కూడా ఇస్తున్నారు. యాచారం మండలం గున్‌గల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కూరగాయల, ఆకు కూరల సాగును ప్రయోగాత్మకంగా అధికారులు చేపట్టారు. డీఆర్‌డీవో పీడీ ఇన్‌చార్జ్ జిల్లా సంక్షేమాధికారి శ్రీలత, సీడీపీవో వినీత, ఎంపీడీవో బాలశంకర్ ఇక్కడ ఇటీవల విత్తనాలు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విత్తనాల పంపిణీ పూర్తి

అంగన్‌వాడీల్లో ఆకుకూరలు, కూరగాయల పెంపకం కోసం అవసరమైన విత్తనాల పంపిణీ ప్రక్రియ పూర్తయింది. జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా విత్తనాలను అందజేస్తున్నారు. ఎంపిక చేసిన కేంద్రాలకు పాలకూర, మెంతికూర, తోటకూర, టమాట, వంగ, బెండ విత్తనాలను సరఫరా చేశారు. అన్నిచోట్ల గురువారం, శుక్రవారం విత్తనాల పంపిణీ ప్రక్రియ పూర్తి చేశారు.

మరికొన్ని సదుపాయాలు ...

అంగన్‌వాడీ కేంద్రాల్లో మరికొన్ని సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్నారులకు ఆటవస్తువులతో పాటు ఎల్‌ఈడీ స్క్రీన్లు, సురక్షిత తాగునీటి యంత్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఒక్కో కేంద్రంలో రూ.లక్ష వరకు నిధులు వ్యయం చేస్తోంది. ఎంపిక చేసిన అంగన్‌వాడీల్లో చిన్నారులకు రూ.36వేలతో ఆటవస్తువులు సమకూరుస్తోంది. అలాగే రూ.25వేలతో ఎల్‌ఈడీ స్క్రీన్లు, రూ.16వేలతో ఇంకుడు గుంతలు నిర్మిస్తోంది. సురక్షిత తాగునీటిని అందించేందుకు ఒక్కో కేంద్రంలో రూ.10వేలతో తాగునీటి యంత్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దశలవారీగా వీటిని చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

హక్కుల సాధన కోసమే బీసీ జేఏసీ

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల సాధన కోసమే జేఏసీని ఏర్పాటు చేశామని నాయకులు అన్నారు. ఆదివారం షాద్‌నగర్ బీసీ జేఏసీ చైర్మన్‌గా టీజీ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అంశంపై పెన్షనర్స్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. జేఏసీ చైర్మన్‌గా టీజీ శ్రీనివాస్, కన్వీనర్ కె.రవీంద్రనాథ్, కో-ఆర్డినేటర్ ఎన్.నర్సింహులుగౌడ్, వైస్‌చైర్మన్లుగా బాస వరలక్ష్మి, డి. సురేష్‌కుమార్, కో-కన్వీనర్లు టి.కరుణాకర్, ఎం.వెంకటేశ్, పి.శేఖర్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. అసెంబ్లీ తీర్మానించిన 42శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించాలని నాయకులు అన్నారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు ఎం.నర్సింహులు, ఎస్.రఘునాథ్‌యాదవ్, రాఘవేందర్‌గౌడ్, వెంకటరమణ, నక్క బాల్‌రాజ్, శివకుమార్‌గౌడ్, కత్తి చంద్రశేఖర్, మేకల వెంకటేష్, శంకర్, జలజ, నరేందర్, క్యాసెట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను నిర్వహించుకుందాం



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో గణేష్ ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, వీహెచ్‌పీ సేవాప్రముఖ్ బండారి రమేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 27న చతుర్థి రోజున మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి నిత్య పూజలు చేయాలన్నారు. సెప్టెంబరు 7న చంద్ర గ్రహణం ఉన్నందున 6వ తేదీనే నిమజ్జనోత్సవాన్ని ముగించాలని కోరారు. పోలీసులకు విధిగా ఆన్‌లైన్‌లో మండపాల వివరాలివ్వాలని సూచించారు. మైకుల్లో భక్తి పాటలే పెట్టాలని, సామూహిక భజనలు, కోలాటాలను నిర్వహించాలని కోరారు. గ్రామీణులొచ్చి తిలకించేలా నిమజ్జనోత్సవాన్ని సాయంత్రమే ప్రారంభించాలని, ఉత్సవాల విజయవంతానికి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరు సహకరించాలని ఈ సందర్భంగా రమేశ్ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి

చేవెళ్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. ఆదివారం చేవెళ్లలో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరల దృష్ట్యా కార్మికులకు పనికి తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 19, 20 తేదీల్లో తుర్కయంజాల్‌లో నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అంతకుముందు చేవెళ్ల కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. చేవెళ్ల మునిసిపాలిటీ అధ్యక్షుడిగా నరేశ్, ప్రధాన కార్యదర్శి చాకలి నరేశ్, కోశాధికారి సిద్ధమ్మ, ఉపాధ్యక్షులు దస్తగిరి, భాస్కర్, నర్సింలు, సహాయ కార్యదర్శులు జనార్ధన్, అఫ్జల్, మహేందర్, కిష్టయ్య, సభ్యులుగా మాణిక్యం, మల్లయ్య, జంగమ్మ, అడివమ్మ, శివయ్య, శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు.

ప్రభుత్వాస్పత్రుల్లో 'కార్పొరేట్' వైద్యం



చెక్కు అందజేస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికే దక్కిందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కడ్తాల్‌కు చెందిన మంజులకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2.5లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. ఆదివారం మండల కేంద్రంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిచ్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డిలు బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బిచ్యానాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, షాబుద్దీన్, మల్లేశ్‌గౌడ్, శ్రీకాంత్, దశరథ్, నరేశ్, సత్యం పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్

కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి

నందిగామ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం చేగూర్‌లో హెచ్‌ఎమ్‌డీఏ నిధులు రూ.55లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను నాయకులతో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు, నాయకులు కుమార్ గౌడ్, మంకాల శ్రీశైలం, ఆవుల శివ, రాజశేఖర్, రాజు, రవితేజ, భాస్కర్, వెంకట్‌చారి, రవి, గిరి, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువత స్వశక్తితో ఎదగాలి

కడ్తాల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికంగా ఎదగాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని మక్తమాదారంలో అక్యారి శివ ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి పథకాన్ని దశరథ్ నాయక్ ఆదివారం ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ మంజులా చంద్రమౌళి, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, నాయకులు గణేశ్, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్, జలీల్, జంగయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నరక ప్రాయం..
తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు

- రెండు హైవేలకు అనుసంధాన రహదారి
- రెండేళ్లుగా పడకేసిన విస్తరణ పనులు
- కంకర తేలి ధ్వంసం.. తరచూ ప్రమాదాలు
- పనులు పూర్తి చేయాలని మంత్రిని కలిసి వినతి



మరమ్మతులకు నోచుకోని తుమ్మలూరు రోడ్డు

మహేశ్వరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తుమ్మలూరు మీదుగా ఇటు మహేశ్వరం, అటు శ్రీశైలం-హైదరాబాద్ రహదారికి రోజూ వందలాది వాహనాలు వెళ్తుంటాయి. అయితే రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండడంతో రెండేళ్లుగా ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రభుత్వం 5కిలో మీటర్ల రోడ్డు విస్తరణకు రూ.14కోట్లు మంజూరు చేసింది. ప్రారంభంలో పనులను వేగంగానే చేసిన కాంట్రాక్టర్ ఇప్పుడు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో తుమ్మలూరు, మహేశ్వరం ప్రాంత ప్రజలే కాకుండా శ్రీశైలం, బెంగళూరు రెండు జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డును వినియోగించే ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై ఉన్న కంకర రాళ్లు తగిలి వాహనాలు రిపేరుకొస్తున్నాయి. దుమ్ముతో జనం అవస్థ పడుతున్నారు. హైదరాబాద్-బెంగళూరు 44వ నంబరు హైవే నుంచి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపైకి చేరాలంటే తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు వాడకం తప్పదు. ఇంత ముఖ్యమైన ఈ రోడ్డు విస్తరణ పనులు పది నెలలుగా పడకేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఇదిలా ఉంటే తుమ్మలూరు రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తిచేయించేలా పాలకులు అధికారులను ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని రోజుల క్రితం గ్రామ యువకులు రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ మోహన్‌నాయక్‌లను కలిసి రోడ్డు సమస్యను త్వరగా పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు. ఇదిలా ఉంటే ఈ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి పనులను త్వరగా పూర్తిచేయకుంటే ప్రజలతో హైదరాబాద్-శ్రీశైలం దిగ్బంధిస్తామని తుమ్మలూరు మాజీ ఉప సర్పంచ్ కె.శ్రీహరి హెచ్చరించారు.

సమన్వయ సమావేశం నిర్వహించాలి

- భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి



మాట్లాడుతున్న గుండ్ల రామతీర్థ

మేడ్చల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ గుండ్ల రామతీర్థ అన్నారు. ఆదివారం తూంకుంటలో భాగ్యనగర్ ఉత్సవ సమితి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. హిందువులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగల్లో ప్రధానమైనది వినాయక చవితి అన్నారు. ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకునేందుకు రాష్ట్ర స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా మంత్రులు, అధికారులు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనర్లు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులతో సమన్వయ సమావేశాలు నిర్వహించారన్నారు. కానీ మేడ్చల్ జిల్లాలో అందుకు భిన్నంగా అధికారుల తీరు ఉందన్నారు. మేడ్చల్ కలెక్టర్ ఇప్పటి వరకూ సమన్వయ సమావేశాన్ని నిర్వహించలేదన్నారు. ఘట్‌కేసర్ మండల పరిధిలో నిమజ్జనం జరిగే ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో గతేడాది వేసిన విగ్రహాల అవశేషాలు ఇంకా అక్కడే పడి ఉన్నాయన్నారు. భక్తిశ్రద్ధలతో పూజించిన విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించకుంటే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి గణపతి ఉత్సవాలపై భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించి, సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కో-కన్వీనర్లు నూనెమూతల రవీందర్, పొలగొని రాజేశ్, కాంతం చిన్నప్ప, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్

కడ్తాల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ శ్రేణులు సమాయత్తం కావాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కడ్తాలలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చని, ఎన్నికలను ఎదుర్కొనేందుకు స్థానిక నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. అందరు పనిచేసి కల్వకుర్తి నియోజకవర్గంలో అత్యధిక స్థానాల్లో పార్టీ అభ్యర్థులు గెలిచేలా కృషి చేయాలన్నారు. పంచాయతీలు, మండలాలు, మునిసిపాలిటీల్లో ప్రజాప్రతినిదులు లేక పాలన అస్తవ్యస్తమైందన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. కాగా సోమవారం జైపాల్‌యాదవ్ సన్మదినాన్ని పురస్కరించుకొని కడ్తాల మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, పార్టీ జిల్లా, మండల నాయకులు శంకర్, లచ్చీరామ్‌నాయక్, చంద్రమౌళి, రమేశ్, కృష్ణయ్య, వీరయ్య, ప్రవీణ్‌గౌడ్, రామకృష్ణ, బిక్షపతి, పత్యనాయక్, జి.శ్రీనివాస్, వెంకటయ్యగౌడ్, బాబ, శ్రీకాంత్, నాగార్జున, చెన్నయ్య, యాదయ్య, సురేశ్, కుమార్ పాల్గొన్నారు.

స్కూళ్లకు చేరిన టెన్త్ మెమోలు

ఈ ఏడాది మార్కుల జాబితాల్లో మార్పులు

బషీరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల మార్క్స్ మెమోలు పాఠశాలలకు చేరాయి. కాగా సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు 'పది' మార్కుల జాబితాలో ఈ ఏడాది మార్పులు చేసింది. గతంలో ఉన్న గ్రేడింగ్ విధానాన్ని సవరించి సబ్జెక్టుల వారీగా మార్కులతో ఏప్రిల్‌లో ఫలితాలను విడుదల చేసింది. మార్కు మెమోలను బోర్డు అధికారులు స్పీడ్ పోస్టులో పంపడంతో మండలంలోని స్కూళ్లకు సర్టిఫికెట్లు వచ్చాయి. గతేడాది వరకు ఫలితాల్లో సబ్జెక్టు మార్కులతో పాటు గ్రేడ్ పాయింట్లు వేసేవారు. ఈ సారి సబ్జెక్టుల థియరీకి 80, ఇంటర్నల్‌కు 20 చొప్పున మార్కులు కేటాయించారు. సాధించిన మార్కులతో గ్రేడింగ్ పేర్కొన్నారు. చివరగా పాస్/ఫెయిల్ మాత్రమే రాశారు. మొత్తం ఎన్ని మార్కులొచ్చాయనేది సబ్జెక్టుల వారీగా కూడితే తప్ప తెలియని పరిస్థితి ఉండటం గమనార్హం.



పదో తరగతి మార్కుల మెమో

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్

ఆమనగల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకనుగుణంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం వర్కర్స్, సిబ్బంది యూనియన్ 3వ మహాసభలు వింజమూరి నర్సింహ అధ్యక్షతన నిర్వహించారు. సెప్టెంబరు 19, 20 తేదీల్లో తుర్కయంజాల్‌లో నిర్వహించే రాష్ట్ర 5వ మహా సభలకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు, పెన్షన్ సౌకర్యం, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.50లక్షలు, ప్రభుత్వ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివశంకర్, వగ్గు రవి, హంసమ్మ, నర్సింహ, మైసమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్తదానం చేస్తే బలహీనమవుతామనే అపోహ చాలా మందిలో ఉంటుందన్నారు. అది వాస్తవం కాదని, రక్తదానం చేసినా, చేయకపోయినా మనిషిలో పాత రక్తకణాలు చనిపోవడం, కొత్తవి పుట్టడం సహజం అన్నారు. రక్తదానం అత్యవసర సమయాల్లో ఎన్నో ప్రాణాలను నిలబెడుతుందన్నారు. రక్తదానం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి మధు అక్కయ్య, డాక్టర్ సబితాఆనంద్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు గోపాల్, అనంతరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, విజయ్‌కుమార్, సుభాన్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఓటుకు నోటు' డాక్యుమెంటరీ చిత్రీకరణ



డాక్యుమెంటరీ చిత్రీకరణలో పాల్గొన్న కళాకారులు

ఘట్‌కేసర్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): 'ఓటును అమ్ముకోకండి-నమ్ముకోండి.' అని ప్రజలను చైతన్యపరిచేలా దర్శకుడు, రచయిత, నటుడు బుడితి కోటేశ్ డాక్యుమెంటరీని చిత్రీకరిస్తున్నాడు. ఆదివారం ఘట్‌కేసర్‌లోని బాలాజీనగర్ పరిసరాల్లో ఇందుకు సంబంధించి కళాకారులతో చిత్రీకరించారు. కోటేశ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, దాని ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఈ షార్ట్ ఫిల్మ్‌ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. వ్యక్తులు తమ ఓటును కరెన్సీ నోటుకో, బిర్యానీ పొట్లానికో అమ్ముకుంటే సమాజం ఐదేళ్ల అభివృద్ధికి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి అనేక అంశాలపై అవగాహన కల్పించేందుకే తాను ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు తెలిపారు. దీనికి కెమెరామన్ అండ్ ఎడిటర్‌గా పొట్ట భానుచందర్ వ్యవహరిస్తున్నట్టు తెలిపారు.

పీఏసీఎస్‌లు రైతులకు దన్నుగా నిలవాలి



ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానిస్తున్న ప్యాక్స్ చైర్మన్ వెంకటేశ్, డైరెక్టర్లు

ఆమనగల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సహకార వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. ప్యాక్స్ పాలకవర్గాల కాల పరిమితిని 6నెలలు పొడిగించడాన్ని హర్షిస్తూ కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డిని ఆమనగల్లు ప్యాక్స్ చైర్మన్ గంప వెంకటేశ్, డైరెక్టర్లు ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిశారు. బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహతో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లు రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు వీరయ్య, వెంకటయ్య, దోళ్యానాయక్, సేవ్య, జంగమ్మ, వికాస్, సీఈవో దేవేందర్, విండో సిబ్బంది అల్లాజి, పద్మాకర్, నాయకులు ఎల్లాగౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం



పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ

కడ్తాల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విద్య కోసం వెచ్చించే ప్రతీ రూపాయి ఖర్చు భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా భావించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తోందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కడ్తాల మండలం రావిచెడ్‌లో రూ.12లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ భవనాన్ని ఆదివారం నాయకులతో కలిసి వారు పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తిచేసి ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బిచ్యానాయక్, జనార్ధన్‌గౌడ్, రమేశ్, శ్రీశైలం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీకి నిలిచిన నీటి సరఫరా

ధారూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధి నాగసమందర్ 11వ వార్డు ఎస్సీ కాలనీలో తాగునీరు రాక ప్రజలు అవస్థ పడుతున్నారు. ఇంతకుముందు వారానికి ఒకసారి నల్లానీరు వదిలేవారని.. ప్రస్తుతం కాలనీకి మొత్తానికే తాగునీరు సరఫరా నిలిచిపోయిందని కాలనీ వాసులు చెప్పారు. గ్రామంలో 3 వాటర్ ట్యాంకులు ఉన్నా తమ కాలనీకి నీటి సరఫరా లేదని ఆదివారం వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శిని అడిగితే.. కొత్త బోరు వేస్తేనే మీ గల్లీకి తాగునీరు వస్తుందని చెబుతున్నారని వాపోయారు. నెల రోజులుగా కాలనీలోని 25ఇళ్లకు నీటి సరఫరా నిలిచి ఇతర కాలనీలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నామని ప్రజలు చెప్పారు. అధికారులు స్పందించి తమ కాలనీలో నీటి సమస్య తీర్చాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

● ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్

ఫేస్ టు ఫేస్



పరిగి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చని ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: రోగాలు దరిచేరకుండా ఏం చేయాలి?

డాక్టర్: ప్రస్తుత సీజన్‌లో వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ వేడిచేసి చల్లార్చిన నీటిని తాగితే ఎలాంటి వ్యాధులు సోకవు.

ఆంధ్రజ్యోతి: సీజనల్ వ్యాధులేంటి?

డాక్టర్: వర్షాకాలంలో రెండు రకాల సీజనల్ వ్యాధులు సోకుతాయి. కలుషిత నీటిని తాగడంతో టైఫాయిడ్, పచ్చకామెర్లు, నీళ్ల విరోచనాలు వస్తాయి. కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల రక్త విరోచనాలు, నులిపురుగుగుడ్లతో ఆరోగ్య సమస్యలతో పాటు రక్తహీనత వస్తుంది.

ఆంధ్రజ్యోతి: దోమకాటుతో వచ్చే వ్యాధులేంటి?

డాక్టర్: ఎక్కడైతే నీటి నిల్వ ఉంటుందో అక్కడ దోమలు వృద్ధిచెందుతాయి. దోమల కాటుతో మలేరియా, డెంగీ బోధకాలు, మెదడువాపు, చికెన్‌గున్యా వ్యాధులు సోకుతాయి. వీటి లక్షణాలు కలిగిన వారు నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రులను సంప్రదించి వైద్య సేవలు పొందాలి.

ఆంధ్రజ్యోతి: ప్రజలకు మీరిచ్చే సలహాలు?

డాక్టర్: ప్రజలంతా పరిశుభ్రతను పాటించాలి. ఇంటి ఆవరణలో వర్షం, మురుగు నీరు ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారు.

యూరియా కొరతపై బీఆర్ఎస్ ఆరోపణలు అసత్యం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బంట్వారం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రెండు నెలలుగా మండలంలోని ఏ ఒక్క రైతుకూ యూరియా కొరత రాకుండా అధికారులు శ్రద్ధ తీసుకున్నారని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలు కేంద్రంతో చర్చించి అదనంగా యూరియా మంజూరు చేయించుకున్నారని చెప్పారు. స్థానికంగా ఉండి వ్యవసాయం చేయని నాయకులు యూరియా గురించి మాట్లాడటం ఆశ్చర్యకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున రైతు వ్యతిరేకుల అసలు రంగు బయటపెట్టామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి, నర్సింలు, ఇసాక్, నాయకులు మొగులయ్య, పురుషోత్తం రెడ్డి, రంగారెడ్డి, నూర్జంపల్లి నర్సింహులు, నర్సింహారెడ్డి, నర్సిములు, మోహన్ రెడ్డి, అంజిరెడ్డి, కృష్ణయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి గ్రామోత్సవాలు

ధారూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎబ్బనూర్, హరిదాసుపల్లి గ్రామాల్లో ఆదివారం శ్రీ సత్యసాయి గ్రామోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో భజన, బాలవికాస్ విద్యార్థులు పద్యాలు, శ్లోకాలు, కథల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. పారిశుధ్య కార్మికులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ, పాఠశాలల స్వీపర్లకు నిర్వాహకులు సన్మానించారు. స్వామివారికి హారతినిచ్చి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి రాష్ట్ర వైద్య విభాగ సమన్వయకర్త బాస్కర్ రావు, రూరల్ కమ్యూనిటీ సెంటర్ సెక్రటరీ, ట్రెజరర్ సుజాత, ప్రేమ్‌కుమార్, పదాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను పునరుద్ధరించాలి

బషీరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు సేవలు పునరుద్ధరించాలని ఉద్యోగులు, ఖాతాదారులు పలువురు కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు బ్యాంకు భవనంపై కప్పు కురువడంతో గత ఐదారు రోజులుగా సేవలు నిలిచిపోయాయి. ఈ భవనం తడిసి ముద్దవడంతో గోడలకు షార్ట్‌సర్క్యూట్ వచ్చి బ్యాంకు సేవలు పూర్తిగా నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో స్థానిక ఉద్యోగులు, ఖాతాదారులు బ్యాంకులో సేవలు అందక ఇబ్బందులుపడ్డారు. బ్యాంకు సేవలను త్వరగా ప్రారంభించాలని ఖాతాదారులు కోరుతున్నారు.

బోరు పనులు ప్రారంభం

తాండూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హిందూ ఉత్సవ కేంద్ర సమితి స్థలంలో భవన నిర్మాణంలో భాగంగా ఆదివారం మంచినీటి బోరును స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆర్‌బీఓఎల్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, హిందూ ఉత్సవ కేంద్ర సమితి గౌరవాధ్యక్షుడు రాజుగౌడ్, అధ్యక్షుడు స్వప్న, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

పరిగి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంతో పాటు, అన్ని గ్రామాలకు సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ హరికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

భోజ్యానాయక్‌తండా అభివృద్ధికి కృషి



ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న శాంతిగోపాల్

బషీరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో తండా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు భోజ్యానాయక్‌తండా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షురాలు శాంతిగోపాల్ అన్నారు. తండాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మఇళ్లను ఆదివారం ఆమె కలియ తిరిగి పరిశీలించారు. తండాకు 10ఇళ్లు మంజూరుకాగా తొమ్మిది ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. స్థానిక సోమ్‌సాద్ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ.5లక్షలతో బాత్రూంల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసి తండాకు మరో 15ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని వెల్లడించారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా మండల వ్యాప్తంగా తిరిగి కృషి చేస్తానన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా!



పెద్దేముల్: గోపాల్‌పూర్-నర్సాపూర్ గ్రామాల మధ్య రోడ్డుపై ఏర్పడిన గుంతలు

పెద్దేముల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గోపాల్‌పూర్-నర్సాపూర్ గ్రామాల మధ్యన రోడ్డు అధ్వానంగా మారింది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అందులో వర్షపునీరు నిండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల కేంద్రం నుంచి నర్సాపూర్, రుద్రారం, ఇందూరు గ్రామాల ప్రజలు ఈరోడ్డు మీదుగానే ప్రయాణిస్తుంటారు. గుంతల రోడ్డుతో ద్విచక్రవాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. గోపాల్‌పూర్ నుంచి నర్సాపూర్ వరకు 4.6కిలోమీటర్ల రోడ్డును బీటీరోడ్డుగా మార్చేందుకు గతప్రభుత్వంలో 2.25కోట్లు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అప్పట్లో ఉన్నరోడ్డును తవ్వేసి కొత్తగా రోడ్డు వేసేందుకు కంకరవేసి తొక్కించాడు. తరువాత ఆ పనులను అర్థాంతరంగా నిలిపివేశాడు. పాలకులకు, అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి గుతలను పూడ్చివేసి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

రోడ్డును బాగుచేయండి



పెద్దేముల్ మండల కేంద్రానికి వెళ్లడానికి ఇదేరోడ్డుపై వెళ్తుంటాం. గోపాల్‌పూర్ నుంచి నర్సాపూర్ వరకు రోడ్డు వేస్తామని మధ్యలోనే ఆపేశారు. రోడ్డంతా గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలి. - బాల్‌రాజ్ (ఇందూరు)



మూలమలుపు వద్ద గుంతలతో ప్రమాదకరంగా రోడ్డు

మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలి



పరిగి: మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి,ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్ రెడ్డి అన్నారు. మాజీ జడ్పీటీసీ మలిపెద్ది మేఘమాలప్రభాకర్‌గుప్త ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలోని ఆమె స్వగృహంలో ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మేఘమాలను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈసారి విరివిగా వర్షాలు కురిసిన నేపథ్యంలో ఉత్సవాలను వైభవంగా జరుపుకోవాలన్నారు. ఎక్కడైనా సరే మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మలిపెద్ది మేఘమాల, మాజీ మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, మాజీ అధ్యక్షుడు బి.ప్రవీణ్‌రెడ్డి, నాయకులు ఆర్.ఆంజనేయులు, కంకల్ ప్రభాకర్, కావలి లక్ష్మి, భాస్కర్ పాల్గొన్నారు.



పూడూరు: మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్: ఈనెల 27న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని అనుమతులు పొందాలని ఎస్ఐ రాజ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. భద్రత, బందోబస్తుకు ఆన్‌లైన్ నమోదు అని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఆంజనేయులు

సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు

ఘట్‌కేసర్ రూరల్: అన్నిశాఖల సమన్వయంతోనే వినాయక నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేష్ తెలిపారు. ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను అధికారులు ప్రారంభించారు. వాహనాలకు ఇబ్బందులు కలుగకుండ రోడ్లకు ఇరువైపుల చెట్లకొమ్మలను తొలగించినట్లు తెలిపారు. పోచారం మున్సిపల్ ఆధ్వర్యంలో నిమజ్జనం కోసం రెండు క్రేన్లు, అర్ అండ్ బీ ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతులు, పోలీసు శాఖ వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తరలించడానికి మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా 7, 9, 11 రోజుల్లో వినాయకులను అధిక సంఖ్యలో నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



లక్ష్మీనారాయణ చెరువు వినాయక ఘాట్ వద్ద విద్యుత్ లైట్ల కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు

డీజేలు వినియోగిస్తే చర్యలు

కీసర రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో డీజే వినియోగించిన వారిపై చర్యలు తీసుకుంటామని కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు హెచ్చరించారు. కీసర పోలీస్ స్టేషన్‌లో ఆదివారం డీజే ఆపరేటర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఋూ కార్యక్రమంలో ఎస్ఐలు నాగరాజు, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పూడూరు: వినాయక మండపం నిర్వహకులు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగ్గా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వివిధ పార్టీల రాజకీయ నాయకులతో కలిసి శాంతి సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వహకులు నిబంధల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్, దోమ ఎస్ఐ, వివిధ పార్టీల నాయకులు, వినాయక మండపాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



వికారాబాద్: బుగ్గ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వీరశైవ సమాజం బృందం

వికారాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకని శ్రీబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో వీరశైవ సమాజం ఆధ్వర్యంలో కొనసాగించిన శ్రావణమాస నిత్య అన్నదానం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా బుగ్గ రామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సహకరించిన బాధ్యులను వీరశైవ సమాజం అధ్యక్షుడు అప్ప విజయకుమార్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమాజం బాధ్యులు వీరేశం, చెక్క వీరన్న, కేటీ సంగప్ప, గాండ్ల వీరేశం, దయానందస్వామి, బుచ్చప్ప, విజయకుమార్, కొఠారీ, దాతలు, సమాజం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్‌లోని శ్రీజగద్గురు నిరంజన మఠంలో వీరశైవలింగాయత్ సభ్యులు మహారుద్రాభిషేకం నిర్వహించారు. శ్రావణ మాసం ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయంలో బసవలింగేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మఠాధిపతులు డాక్టర్ సిద్దిలింగమహాస్వామి ఆధ్వర్యంలో పూజారులు శాస్త్రోక్తంగా మంత్రోచ్చరణలతో నమకం, చమకం అధ్యాయాలతో మహారుద్రాభిషేకం నిర్వహించారు. గణపతి పూజ, సంకల్పం, రుద్రాభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అష్టోత్తర శతనామావళితో త్రిదళం బిల్వపత్రాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో స్వామివారికి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా బాలాజీ నగర్ హనుమాన్ ఆలయంలో ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అదేవిధంగా పట్టణంలోని మహాదేవ శివాలయంలో ఆదివారం అక్కమహాదేవి మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రావణమాసం ముగింపు సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి, పార్వతీ మాత అమ్మవారికి దూప, దీప నైవేధ్యంతో మంగళహారతులతో పూజలు నిర్వహించారు.



కొడంగల్: బసవేశ్వరస్వామి పల్లకీ సేవను నిర్వహిస్తున్న వీరశైవలింగాయత్ సభ్యులు

పదోన్నతుల పండుగ

(ఐదో పేజీ తరువాయి)

మూడు బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నాయి. మొత్తం ఖాళీలకు ఈ పోస్టులకు కలపనున్నారు. ఖాళీగా ఉన్న మొత్తం పోస్టుల్లో 70 శాతం ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించి భర్తీ చేస్తుండగా, 30 శాతం పోస్టులనే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్న విషయం తెలిసిందే. జీహెచ్‌ఎం 100 శాతం భర్తీ చేయగా, పీఎస్ హెచ్‌ఎం పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం పదోన్నతులతో భర్తీ చేయనుండగా, 30శాతం కొత్త నియామకాల కోసం ఉంచారు.

స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు 165

జిల్లాలో 776 ప్రాథమిక, 116 ప్రాథమికోన్నత, 176 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో విద్యాబోధన చేసేందుకు మొత్తం 4,659 అన్ని కేటగిరీల ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం జిల్లాలో 4,241 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా, జిల్లాలో స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ క్లియర్ వేకెన్సీలు 165 ఉన్నాయి. స్థానిక సంస్థల ఉన్నత పాఠశాలల్లో పీఎస్ హెచ్‌ఎం పోస్టులు 16ఖాళీగా ఉండగా, తెలుగు మీడియం స్కూల్ అసిసెంట్ పోస్టుల్లో బయోసైన్స్ తెలుగు మీడియంలో 17, ఇంగ్లీష్‌లో 24, హిందీ 11, మేథమెటిక్స్ 14, ఫిజికల్ ఎడ్యుకేషన్ 5, ఫిజికల్ సైన్స్ 10, స్పెషల్ ఎడ్యుకేషన్ 8, సోషల్ స్టడీస్ 21, తెలుగు 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉర్దూ మీడియంలో బయో సైన్స్ 1, మేథమెటిక్స్‌లో 2, ఫిజికల్ సైన్స్‌లో 2, సోషల్ స్టడీస్ 5, ఉర్దూ 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్ 2, హిందీ 2, ఫిజికల్ ఎడ్యుకేషన్ 2, తెలుగు 1 పోస్టు ఖాళీ ఉండగా, ఉర్దూ మీడియంలో మేథమెటిక్స్ 2, ఫిజికల్ సైన్స్ 2, సోషల్ స్టడీస్ 1, ఉర్దూ 1 పోస్టు ఖాళీగా ఉన్నాయి.

పదోన్నతులతో 131 పోస్టులు ...

జిల్లాలో మొత్తం 131 మంది అర్హత కలిగిన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు లభించనున్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 115, పీఎస్ హెచ్‌ఎం పోస్టులు 16 భర్తీ చేయనున్నారు. వీటిలో స్థానిక సంస్థల పాఠశాలల్లో 120 పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయనుండగా, వీటిలో 104 స్కూల్ అసిస్టెంట్, 16పీఎస్ హెచ్‌ఎం పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 11 పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. స్థానిక సంస్థల ఉన్నత పాఠశాలల్లో పీఎస్ హెచ్‌ఎం పోస్టులు 16, తెలుగు మీడియం స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో బయోసైన్స్ 13, ఇంగ్లీష్ మీడియం17, స్కూల్ అసిస్టెంట్ హిందీ 9, మేథమెటిక్స్ 10, ఫిజికల్ ఎడ్యుకేషన్ 4, ఫిజికల్ సైన్స్ 7, స్పెషల్ ఎడ్యుకేషన్ 7, సోషల్ స్టడీస్ 15, తెలుగు 10 పోస్టులను సీనియారిటీ, అర్హత కలిగిన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయనున్నారు. ఉర్దూ మీడియంలో బయోసైన్స్ 1, మేథమెటిక్స్ 2, ఫిజికల్ సైన్స్ 2, సోషల్ స్టడీస్ 4, ఉర్దూ 3 పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్ 2, హిందీ 1, ఫిజికల్ ఎడ్యుకేషన్ 2, తెలుగు 1, ఉర్దూ మీడియంలో మేథమెటిక్స్ 2, ఫిజికల్ సైన్స్ 1, సోషల్ స్టడీస్ 1, ఉర్దూ 1 పోస్టులను పదోన్నతులతో భర్తీ చేస్తారు. పదోన్నతుల్లో నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

తాండూరు ఏటీసీలో అడ్మిషన్లు

(ఐదో పేజీ తరువాయి)

భవనం నిర్మించారు. ఇందులో శిక్షణ కోసం అవసరమైన పరికరాలకు రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నారు. నిరుద్యోగులకు, ఎస్ఎస్సీ పాసైన వారికి ఏడాది, రెండేళ్ల కాల వ్యవధిలో శిక్షణ ఇచ్చి కోర్సు పూర్తయిన తర్వాత టాటా కన్సల్టెన్సీ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తాండూరులో జాబ్‌మేళా ఏర్పాటు చేసి వివిధ కంపెనీల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. తాండూరు ఏటీసీలో సెప్టెంబర్ 1 నుంచి శిక్షణ ప్రారంభ కానుంది. వివరాలకు ప్రిన్సిపాల్ సాయన్న(84999 75115)ను సంప్రదించవచ్చు.

కోర్సుల వివరాలు

2025-26 సంవ్సతరానికిగాను ఎస్ఎస్సీ పాసైన వారికి ఏడాదికి సంబంధించి ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యాన్యుఫ్యాక్టరింగ్, టెక్నీషియన్, న్యూమ్యాన్యూ ఫ్యాక్టరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమెషిన్ ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్ కోర్సులు ఉన్నాయి. రెండేళ్ల కాలపరిమితికి సంబంధికి పర్సనల్ ఎనాలసిస్, డిజైనర్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్ మెకానికల్ ఎలక్ట్రికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కుల ధ్రువీకరణ, ఆధార్, టీసీ, బోనాఫైడ్, ఎస్ఎస్సీ మెమో, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

ఏటీసీతో యువతకు భవిష్యత్తు

తాండూరు రూరల్: తాండూరు ఐటీఐలో ద్వారా భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం ఏటీసీ సెంటర్‌ను తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు అబ్దుల్ రవూఫ్ పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జుబేర్ లాల, ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు సర్దార్‌ఖాన్, వడ్డె శ్రీనివాస్, బంటు మల్లప్ప, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, అధ్యక్షురాలు మాధవి, బంటు వేణుగోపాల్, సర్దార్‌ఖాన్, సంతోష్‌కుమార్, సత్యమూర్తి, రాము ఉన్నార

దేశరక్షణకు రాజీలేని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న వక్త కేరెల్లి అనంత్‌రెడ్డి

మోమిన్‌పేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దేశరక్షణకు ఆర్ఎస్ఎస్ రాజీలేని పోరాటం చేస్తోందని వక్త కేరెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఏజేఆర్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మ పరిరక్షణ, దేశ రక్షణలో ఆర్ఎస్ఎస్ నిరంతరం పని చేస్తోందన్నారు. దేశానికి ఆర్ఎస్ఎస్ సేవలు అనివార్యమన్నారు. సంస్థ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని వందేళ్లు పూర్తి చేసుకొని మరో వసంతంలోకి అడుగు పెట్టిందన్నారు. దేశ స్వాతంత్ర్యంలో పాలకులు ఆర్ఎస్ఎస్ పాత్రను తగ్గించి చూపిస్తున్నారని ఆరోపించారు. హిందూ మతాన్ని, ధర్మాన్ని తగ్గించే కుట్రలను ఎప్పటికప్పుడు భగ్నం చేయాలని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పురాణాలు, ఇతిహాసాలపై జరుగుతున్న దాడులను ఆయన ఖండించారు. వచ్చే దసరా నుంచి అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాలమూర్ విభాగ సహ కార్యవాహ ఆర్ఎస్ఎస్ వెంకటయ్య, ఆమ్రాది శ్రీకాంత్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంట్లో ఊటనీటితో ఇబ్బందులు



ఇంట్లోకి వచ్చిన ఊటనీటిని చూపిస్తున్న గోపాల్

దోమ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన మంగలి గోపాల్ ఇంట్లో ఊటనీరు రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయాడు. అయినాపూర్ పెద్దచెరువు నీటి సామర్థ్యం పెరగడంతో గ్రామంలో లోతట్టుగా ఉన్న పురాతన ఇళ్లలోకి ఊటనీరు వస్తోంది. నిరుపేద కుటుంబానికి చెందిన గోపాల్‌కు ఆర్థిక స్థోమతలేక ఇల్లు కట్టుకోలేక పురాతన ఇంట్లోనే జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని గోపాల్ కోరాడు.

అభివృద్ధికి ఎంఐఎం వ్యతిరేకం కాదు



మాట్లాడుతున్న గుల్షన్

కొడంగల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ అభివృద్ధిలో భాగంగా అధికారులు తీసుకుంటున్న చర్యలకు ఎంఐఎం పార్టీ వ్యతిరేకం కాదని నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ బీ.గుల్షన్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ముందు ఉన్న చిరువ్యాపారుల డబ్బాలను తొలగించడంతో కుటుంబాల పోషణ భారంగా మారుతున్నదన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు వెంటనే బస్టాండ్ ముందు ఎన్నో ఏళ్లుగా చిరువ్యాపారులు జీవనం కొనసాగిస్తున్న వారికి ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణంతో దుకాణాలను కేటాయించాలన్నారు. అభివృద్ధిలో డబ్బాలను ఒక్కటే తొలగించడం కాదు.. అందరికీ సమన్యాయం ఉండాలన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

దోమ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే చోట చేరారు. మండల కేంద్రంలోని ఎస్‌జీ గార్డెన్ ఇందుకు వేదికైంది. ఈ సందర్భంగా అప్పట్లో విద్యాబుద్దులు నేర్పించిన గురువులు శేషయ్య, చెన్నకేశవులు, సదానందం, బురానోద్దీన్ తదితరులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. 38 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో దోమ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, గులాంసర్దార్, జనార్దన్, సురేశ్, శ్రీశైలం, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటుకు గది పరిశీలన



ప్రభుత్వ పాఠశాలలో గదిని పరిశీలిస్తున్న నాయకులు

బంట్వారం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బస్వాపూర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో గ్రామ గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నట్లు మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాకం నర్సిములు అన్నారు. బస్వాపూర్ గ్రామంలో ఆదివారం వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒగదిని పరిశీలించారు. గ్రంథాలయ కేటాయింపునకు అధికారులు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గ్రామస్తులు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, శివరాజు, హనుమయ్య, మధుసూదన్‌రెడ్డి, పూలపల్లి బిచ్చన్న, కృష్ణ, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాగర్జనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్

పరిగి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, ఇతర పెన్షనర్ల డిమాండ్లతో ఎల్బీ స్టేడియంలో సెప్టెంబరు 9న నిర్వహించనున్న మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జిలు డి.రామకృష్ణ, జి.ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు కె.మల్లికార్జున్‌లు కోరారు. ఎల్బీస్టేడియంలో సెప్టెంబరు 9న తలపెట్టిన మహాగర్జనలో భాగంగా ఆదివారం పరిగిలోని కేఎస్ఆర్ గార్డెన్ జరిగిన సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులకు ఇచ్చే పెన్షన్లు పెంచే యోచనను ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు. సమావేశంలో సంఘం నాయకులు అంజి, శివాజీ, కిష్టన్న, స్వామిదాస్, మహేందర్, ప్రకాష్, పుష్పరాణి, రమేశ్, మాధవి పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలి

కొడంగల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో బీసీసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన బీసీల సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయాలని కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.